ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
బుధవారం | సెప్టెంబరు 30, 2026 | సంపుటి : 7 | సంచిక : 102 | పేజీలు : 2

నోరు అదుపుతప్పి మాట్లాడితే..

మహిళలతో కొట్టిస్తాం

- వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ ఫైర్

వరంగల్, ఆయుధం: పార్టీ నాయకులు నోరు అదుపులో పెట్టకుని మాట్లాడాలని.. హద్దుమీరి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని క్యాంపు కార్యాలయంలో అర్హులైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ.60 లక్షలు విలువ చేసే చెక్కులను 111 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా నేతలకు కాంగ్రెస్ నేతలు, ప్రతిపక్ష నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వర్గ విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలని, కొంతమంది నేతలు నోరు హద్దులో పెట్టుకోవాలని కొండా సురేఖ హితవు పలికారు. కొంతమంది నాయకులు హద్దు మీరి మాట్లాడుతున్నారని, నోరు అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తానని హెచ్చరించారు. ఒక్కో మహిళ నలుగురిని కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా కొండా దంపతులను విమర్శించాలంటే నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కొండా అభిమానులను, కాంగ్రెస్ కార్యకర్తలను విమర్శించే వారు ఇకపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు నాయకులు గాలిలో కత్తులు తిప్పుతున్నారని మండిపడ్డారు. వారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

వరంగల్‌కు పూర్తి టైం కేటాయిస్తా..

ఇప్పటి వరకు మంత్రిగా రాష్ట్రానికి సేవ చేయడం వల్ల నియోజకవర్గానికి కొంచెం దూరమయ్యానని ఎమ్మెల్యే సురేఖ పేర్కొన్నారు. మంత్రి పదవి పోవడం గురించి నేను బాధపడటం లేదన్నారు. ఇప్పటి నుంచి వరంగల్‌కి పూర్తి సమయం కేటాయిస్తానని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటానని.. నియోజకవర్గానికి ఏ పని కావాలన్న చేయించే సత్తా తనకు ఉందన్నారు. రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు గురించి చెబితే.. తెప్పిస్తానని.. వరంగల్‌ను అభివృద్ధి చేసుకుందామని మాజీ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

మంత్రిగా ఉండడంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రజలకు దూరమైన విషయం వాస్తవమేనని అంగీకరించిన కొండా సురేఖ క్షేత్రస్థాయిలో పర్యటించి డివిజన్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ప్రభుత్వ ఫలాలను ప్రజల్లోకి తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లపై ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

మహిళా ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన

పోలీసులను గుర్తించండి: హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన కార్యక్రమంలో జరిగిన ఘటనపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని ఆదేశించింది. వారి వివరాలను స్పీకర్‌కు ఇవ్వాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలను హైకోర్టుకు నివేదించాలని పేర్కొంది. అసెంబ్లీ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని స్పష్టం చేసింది.

ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

జాతీయం, ఆయుధం: జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ మరో స్వర్ణం గెలుచుకుంది. 4x400 మీటర్ల రిలేలో మహిళల బృందం పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. కిరణ్ పహల్, పూవమ్మ మచెట్టిర, ప్రాచి, విత్య రామ్‌రాజ్‌లతో కూడిన బృందం.. 3:29.69 నిమిషాల్లో రిలే పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచింది. బహ్రెయిన్, చైనా వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ ఆసియా క్రీడల్లో ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం. మరోవైపు, 4×400 మీటర్ల రిలే ఫైనల్స్‌లో పురుషుల జట్టు కాంస్య పతకం సాధించింది. దీంతో ఇప్పటివరకు ఆసియన్ గేమ్స్‌లో భారత్ సాధించిన పతకాల సంఖ్య 52కి పెరిగింది. వీటిలో ఆరు స్వర్ణ పతకాలు కాగా.. 21 రజతం, 25 కాంస్య పతకాలు ఉన్నారు.

2 లో

కాంగ్రెస్‌ది తుగ్లక్ నిర్ణయం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

టన్ను రూ.3,800 చొప్పున వచ్చే సింగరేణి బొగ్గును జెన్‌కోకు వద్దని.. టన్ను రూ.9,000కి వచ్చే విదేశీ బొగ్గు దిగుమతికి అంగీకరించడం.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మరో తుగ్లక్ నిర్ణయమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఇదంతా ఎవరి ప్రయోజనం కోసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలు ఈ భారాన్ని ఎందుకు మోయాలని ప్రశ్నించారు. "దక్షిణ భారతంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయి. ఏపీ, తమిళనాడు, మహారాష్ట్రలకు బొగ్గును సరఫరా చేసేది సింగరేణి సంస్థే. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించాం" అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణం పూర్తైనా..

ప్రారంభించరా?

- కుటుంబ పదవులపై ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు ప్రజలపై లేదా?

- బూడిద గుమ్మడికాయతో దిష్టితీసి నిరసన
- బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు ధ్వజం

వరంగల్, ఆయుధం: వరంగల్ సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పూర్తైనా ప్రారంభించరా అనిబీజేపీ రాష్ట్ర నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రశ్నించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను నిలదీస్తూ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో ఓ సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసనలో భాగంగా బూడిద గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. భవనం నిర్మాణం పూర్తయినా నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా వరంగల్‌లో ఉన్నప్పుడు ప్రజలు ప్రతి ప్రభుత్వ పనికోసం హన్మకొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని నిలదీశారు. ఏ శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు తిరగాల్సి వస్తోందని, తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా హన్మకొండ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

పదవులపైనే దృష్టి..

"కుటుంబంలో ఎవరికి ఏ పదవి రావాలి.. ఎవరు ఎమ్మెల్సీ కావాలి.. ఎవరు ఎమ్మెల్యే కావాలి అనే ఆరాటం ఉంటే, మీ కుటుంబానికి ఎన్ని పదవులు కావాలో అన్ని పదవులు తీసుకోండి.. చివరికి ముఖ్యమంత్రి పదవి కూడా మీరే తీసుకోండి. కానీ మిమ్మల్ని గెలిపించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు మీరు ఏం న్యాయం చేస్తున్నారు?" అని ప్రదీప్ రావు ప్రశ్నించారు. "నెలలో కనీసం 20 రోజులైనా తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు వినే బాధ్యత మీకు లేదా? అధికారంలో ఉన్నప్పుడు పదవులు కావాలి.. కానీ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండరా?" ఇలాగే చేస్తే రాబోయే రోజుల్లో క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని అని హెచ్చరించారు.

మంత్రి పదవి ఉన్నా ఓరిగిందేమీ లేదు

కాకతీయుల చారిత్రక రాజధాని అయిన వరంగల్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్ ముందు కాకతీయ కీర్తి తోరణం లేకపోవడం కూడా ప్రజల మనోభావాలను దెబ్బతీసే అంశమన్నారు. కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించి, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

"పదవుల కోసం రాజకీయాలు చేయడం కాదు.. ప్రజల కోసం పనిచేయండి. వరంగల్ తూర్పు ప్రజలకు అందుబాటులోకి రండి. పూర్తయిన కలెక్టరేట్‌ను వెంటనే ప్రారంభించండి. ప్రజలను ఇంకా ఎన్నాళ్లు హన్మకొండకు తిప్పుతారు?" అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

వీరితోపాటు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జలగం రంజిత్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, తాజా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రీసర్వేతో భూ వివాదాలకు

శాశ్వత పరిష్కారం

- రైతులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే నిర్వహించాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఆత్మకూరు, ఆయుధం: ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలను పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, సందేహాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రీసర్వే ప్రక్రియలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సహకారం అందించాలని అన్నారు.

సమాజ మార్పు కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమించాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి
- సమస్యలపై స్పందించేది వామపక్ష విద్యార్థి సంఘాలే
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ, ఆయుధం: సమాజ మార్పు కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉద్యమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా రెండవ రోజు హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని బాల వికాస కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విష బీజాలు నాటేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలన్నారు. విద్యార్థి సంఘాల ద్వారానే ఉత్తమ నాయకులు తయారు అవుతారని, తామంతా ఏఐఎస్ఎఫ్ నుంచే వచ్చామని, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నాటి నుండి సిపిఐ జాతీయ నాయకులందరూ ఒకప్పుడు ఏఐఎస్ఎఫ్ నాయకులేనని గుర్తు చేశారు. ఒకప్పుడు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలకే ఓటు హక్కు అని నినదించి సాధిస్తే నేడు ఉన్న ఓట్లను తొలగిస్తున్నారని, అలా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని విమర్శించారు. విద్యారంగం సమస్యలతో పాటు ఏఐఎస్ఎఫ్ సామాజిక సమస్యలపై కూడా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నేడు సోషల్ మీడియా ప్రభావం కొనసాగుతున్నదని, దానిని ఉపయోగించుకున ఏఐఎస్ఎఫ్ నాయకులు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 90 ఏండ్ల గొప్ప చరిత్ర ఏఐఎస్ఎఫ్ దేనని, ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడిందని చెప్పారు. నేడు కుల సంఘాల ప్రభావం పెరిగి పోతుండడం బాధాకరమని, అయినా వారి సమస్యలపై కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు దృష్టి సారించాలని సూచించారు. నేడు ఉన్నంత సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే నాలుగు దశాబ్దాల క్రితం తాము జెన్ జీ తరహాలో పోరాటాలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. తాము విద్యార్థి దశలో ఎన్నో ప్రతిబంధకాలు ఎదుర్కొన్నామని, నాటి పరిస్థితి నేడు లేదని చెప్పారు. అక్కడ సమస్య ఉంటే అక్కడ స్పందించాల్సిన బాధ్యత వామపక్ష విద్యార్థి సంఘాలదేనని చెప్పారు.

ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు సన్మానం

ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల సందర్భంగా పూర్వ నాయకులను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసుల నాయుడు, కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చల్లా దామోదర్ రెడ్డి, ప్రముఖ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, బాగం హేమంత రావు, బాల నర్సింహా, సాబిర్ పాషా, బి. విజయ సారథి, కర్రె బిక్షపతి, నేదునూరి జ్యోతి, పంజాల శ్రీనివాస్, బివి. విజయలక్ష్మి, వి. మదన్, ఆంజనేయులు, సృజన్ కుమార్, మేడిపల్లి శోభన్ బాబు, బీఆర్ లెనిన్, పల్లె నర్సింహా, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిరంగి రాజన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మణ్, నేతలు పాల్గొన్నారు.

50 ప్రగతి సిటీల్లో జీడబ్ల్యూఎంసీకి చోటు

- స్వచ్ఛతలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్
- SWM Rules–2026, 4-వే సోర్స్ సెగ్రిగేషన్ మార్గదర్శకాలు ఆవిష్కరణ

వరంగల్, ఆయుధం: స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0లో భాగంగా కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) ఆధ్వర్యంలో మంగళవారం న్యూ ఢిల్లీ నుండీ నిర్వహించిన వికసిత్ భారత్ @2047 - స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పలు నూతన కార్యక్రమాలు, మార్గదర్శకాలను ఆవిష్కరించారు. ముఖ్యంగా SWM Rules-2026కు అనుగుణంగా నాలుగు రకాల వ్యర్థాలను మూలస్థాయిలోనే వేర్వేరుగా సేకరించే 4వే సోర్స్ సెగ్రిగేషన్ విధానం, అలాగే ప్రజలు పారిశుద్ధ్య సమస్యలు, ఫిర్యాదులను సులభంగా తెలియజేసి పరిష్కారం పొందేందుకు వాట్సాప్ ఆధారిత ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర మంత్రి విడుదల చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారిశుద్ధ్య నిర్వహణలో వేగం, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచడమే వీటి ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. దేశవ్యాప్తంగా 50 నగరాలను 'ప్రగతి సిటీస్'గా ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి హైదరాబాద్‌తో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అవకాశం లభించింది. ఈ నగరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, మూలస్థాయి వ్యర్థాల వేర్పాటు, శాస్త్రీయ వ్యర్థాల ప్రాసెసింగ్, ప్రజల భాగస్వామ్యం, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాల్లో నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రగతి సిటీలకు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి, దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. నగరాల పరిశుభ్రతను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, జీడబ్ల్యూఎంసీ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. కేంద్రం ఆవిష్కరించిన నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వరంగల్ నగరానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకన్న తెలిపారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ జోలికి వెళ్లొద్దు

హనుమకొండ, ఆయుధం: కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ జాతీయ సేవా పథకం, యాంటీ డ్రగ్ కమిటీ, వరంగల్ పోలీస్ కమిషనరేట్ వారి పోలీస్ కళాజాత బృందం సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణ పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, బెట్టింగ్ యాప్లో జోలికి వెళ్లకూడదని అన్నారు. కళాజాత బృందం అనేక పాటల ద్వారా రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లో మోసాలు, గతంలో జరిగిన అనేక సంఘటనలు వివరించి విద్యార్థినీ విద్యార్థులను చైతన్యవంతం చేశారు. సైబర్ నేరాల విషయంలో 1930కు కాల్ చేయాలని, గోల్డెన్ అవర్ అనేది నేరపు సొమ్ము రికవరీకి అత్యంత ముఖ్యమని, 112కు కూడా కాల్ చేయవచ్చునని విద్యార్థులను చైతన్యవంతం చేసినారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ బి.సీతారాం, డాక్టర్ గన్సింగ్, యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శశికాంత్, ఐసీసీ కన్వీనర్ ప్రొఫెసర్ సమత, స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సాయి దివ్య, ఏఎస్ఐ నాగమణి, కళాజాత బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ
పటిష్టంగా జరగాలి

- ప్రధాన రహదారులు, డివైడర్లు పరిశుభ్రంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ
- జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న

వరంగల్, ఆయుధం: విలీన గ్రామాలతో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్లు, డివైడర్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టంగా చేపట్టి, ఎక్కడా పారిశుద్ధ్య లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం వడ్డేపల్లి చర్చి నుంచి ఉనికిచర్ల ఔటర్ రింగ్ రోడ్డు వరకు బల్దియా పరిధిలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారుల వెంట, డివైడర్ల వద్ద పరిశుభ్రతను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. డివైడర్లలో మొక్కలు ఎండిపోకుండా, ఖాళీలు ఏర్పడకుండా తగిన నిర్వహణ చేపట్టాలని, డివైడర్ల కింద మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. రహదారులు, డివైడర్లు లేదా ఇతర ప్రాంతాల్లో ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు.

ఈ సందర్భంగా గృహిణులతో మాట్లాడిన కమిషనర్, స్వచ్ఛ ఆటోలు ప్రతిరోజూ తమ ప్రాంతాలకు వస్తున్నాయా, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా, చెత్త సేకరణ సేవలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ స్పష్టం చేశారు. గ్రామాల నుంచి నగరానికి అనుసంధానమయ్యే ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్లు, డివైడర్లు సక్రమంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్ల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి గ్యాప్స్ లేకుండా రోజువారీగా మానిటరింగ్ చేపట్టాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులందరూ విధి సమయంలో తప్పనిసరిగా యూనిఫామ్ ధరించి, నిర్దేశిత సమయపట్టిక ప్రకారం విధులు నిర్వహించాలని, క్రమం తప్పకుండా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రాంతాలను నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు డీస్లడ్జింగ్ వాహనాలను క్రమం తప్పకుండా పంపించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సంబంధిత వాహనాల రాకపోకలు, డీస్లడ్జింగ్ ప్రక్రియను సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంతో పాటు విలీన గ్రామాల్లోనూ ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ సంజయ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మాపురంలో ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ, ఆయుధం: ఇటీవల కాలంలో గ్రామంలో విస్తరిస్తున్న వైరల్ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్న ప్రజల సౌకర్యార్థం అమ్మాపురంలో వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యం రాజగోపాల్ తెలిపారు. హాస్పిటళ్లకు వెళ్లలేని వృద్ధులు, వితంతువులు, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా తన తండ్రి కీ.శే.వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అమ్మాపురంలో హనుమకొండ కాకాజీ కాలనీలోని 'ర్యాపిడ్ డయాగ్నోస్టిక్స్', 'అభయ హాస్పిటల్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ క్యాంపులో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వైద్యం గౌతమ్, జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవి మస్సా, గైనకాలజిస్ట్ డాక్టర్ డొంక భార్గవి బృందం ఉచిత వైద్య సేవలు అందించింది. సుమారు 200 మంది గ్రామస్తులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రూ. 40,000 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణకు సహకరించిన గ్రామ సర్పంచ్ బొలగాని రేఖ బాపిరాజు, ఉపసర్పంచ్ ఇర్రి కృష్ణారెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు బోగ అంజయ్య, కక్కెర్ల వెంకటేశ్వర్లు, బొలగాని బిక్షపతి, మోహన్ రెడ్డిలతో పాటు పోతారం, పిట్టలగూడెం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి వైద్యం రాజగోపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కళాశాలలో టాయి లెట్స్,
మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

- విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు టాయ్ లెట్స్, మరుగుదొడ్లు వెంటనే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. టాయిలెట్ రూమ్స్ మరుగుదొడ్లు వాడకంలో లేకపోవడం, లోపల పలిగి పోవడం వలన చెత్తా చెదారం పేరుకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు, కాలేజీ ప్రిన్సిపల్ కు చెప్పినా పట్టించుకోలేదన్నారు. తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు సరిగా పనిచేయడం లేదన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అధికారులు స్పందించి వెంటనే నూతన టాయిలెట్స్ రూమ్స్ ను, మరుగుదొడ్ల ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరీ సాయి కుమార్, భాను ప్రసాద్, రాజ్ కుమార్, సందీప్, ప్రశాంత్, వినోద్ సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మత్తు పదార్థాల దుష్ప్రభావం పై అవగాహన కార్యక్రమం

హనుమకొండ, ఆయుధం: యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొంతమంది యువత సరదా, స్నేహితుల ప్రభావం, ఆసక్తి వంటి కారణాలతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఒకటి రెండు సార్లు తీసుకుంటే ఏమవుతుందనే నిర్లక్ష్య ధోరణి ప్రమాదకరమని, అదే క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల భవిష్యత్తు అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మాదకద్రవ్యాలు కేవలం శరీరానికి మాత్రమే హాని చేయవని, అవి మొత్తం కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను, మానసిక ఆరోగ్యాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. యువత తమ విలువైన జీవితాన్ని మత్తు పదార్థాలకు బలి చేయకుండా లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. మాదక ద్రవ్యాలు అనేది సమాజానికి పెద్ద సమస్యగా మారిందని, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిలబడినప్పుడే ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భవిష్యత్తును కాపాడుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే వ్యక్తి శారీరకంగా, మానసికంగా, సామాజికంగా నష్టపోతారని తెలిపారు. విద్యార్థులు తమ స్నేహితుల్లో ఎవరైనా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నట్లు గుర్తిస్తే వారిని చైతన్యపరచి సరైన మార్గంలోకి తీసుకురావాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సంచాలకులు ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ... జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావన, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని, తమతో పాటు సమాజంలోని ఇతరులను కూడా చైతన్యపరచాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా వారి కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ కుమార్‌స్వామి మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే చట్టపరమైన, ఆరోగ్యపరమైన, సామాజిక పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు బాధ్యతాయుతంగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. యువత అప్రమత్తంగా ఉండి మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ చందర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణ కు ఏఐఎస్ఎఫ్ పోరాడాలి

- కేయూ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి
- ఘనంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధుల సభ ప్రారంభం

కాజీపేట, ఆయుధం: విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు అవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహించాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి విద్యార్థులను కోరారు. మంగళవారం హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాసలో రెండవ రోజు ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ప్రతినిధుల సభ జరిగింది.ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి విద్యార్థి ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో తాను ఏఐఎస్ఎఫ్ తో ప్రయాణించానని, ఏఐఎస్ఎఫ్ నాయకుల ప్రభావం తనపై ఎంతో వుందని, విద్యార్థిగా తనకు మధురమైన జ్ఞాపకాలున్నాయని అన్నారు. సమాజం పూర్తిగా మారుతోందని, తదనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని, పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకై ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. తొలుత ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యా రంగాన్ని రక్షించుకోవడానికి, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమవుతున్నారని ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్ మాట్లాడుతూ దేశంలో నూతన విద్యా పాలసీ పేరుతో పేద దళిత, గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కశిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్,రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం, ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్ గ్యార, క్రాంతి కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్,వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ లో వసతులు మెరుగ్గా ఉండాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: హాస్టల్ లో విద్యార్థులకు మెరుగైన వసతులు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజారులోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని కిచెన్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థులకు అందించేందుకు తయారు చేస్తున్న వంట పదార్థాలను తనిఖీ చేశారు. వంట గదిలోని నిత్యావసరాలు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు అందించే మెనూ చార్ట్ ని పరిశీలించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థుల దగ్గరికి వెళ్లి ...ఈ రోజు పెట్టిన బ్రేక్ ఫాస్ట్ గురించి ఆరా తీశారు. స్నాక్స్, గుడ్లు పెడుతున్నారా అని, టీచర్స్ వస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులకు సంబంధించి వివరాలను విద్యార్థులను అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయనందుకు... అలాగే క్లాస్ రూమ్ లో ఫ్యాన్ రిపేర్ చేయించనందుకు హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ ను కలెక్టర్ మందలించారు. చివరగా విద్యార్థులకు సంబంధించిన టాయిలెట్స్, డార్ మెంట్రీ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. ప్రతి పూట నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వంట తయారీలో నాణ్యమైన నిత్యావసర వస్తువులను, తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. విద్యార్థులకు అందించే టిఫిన్, స్నాక్స్, లంచ్, డిన్నర్ ఏ సమయం లో పెట్టాల్సిన వాటిని సమయానుకూలంగా పెట్టాలని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజన పదార్థాలు నాణ్యతగా, పరిశుభ్ర వాతావరణంలో అందించాలన్నారు. తరగతి గదులు అన్ని కూడా పరిశుభ్రంగా, విద్యార్థులకు అనుకూలమైనవిగా ఉండాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో నేర్చుకున్నవి భవిష్యత్ జీవితంలో స్థిరపడడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా పని చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్ దీప ని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఆత్మకూరు, ఆయుధం: ఆత్మకూరు మండలం అక్కంపేట, కామారం, పెంచికల పేట, నీరుకుల్లా గ్రామాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించి, వారు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. శ్వేత విప్లవం తీసుకురావడంలో భాగంగా దామెరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో 40 వేల కుటుంబాలను డైరీలో చేర్చుతామని అన్నారు. పాడి గేదెలను సక్రమంగా సంరక్షిస్తూ, పాడి ఉత్పత్తిని పెంచుకొని అదనపు ఆదాయం పొందాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలను వినియోగించుకొని కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

కేడీసీలో వనమహోత్సవం

హనుమకొండ, ఆయుధం: కాకతీయ ప్రభుత్వ కళాశాల లో మంగళవారం జాతీయ సేవా పథకం, ఎన్ సి సి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ నేతృత్వంలో వనమహోత్సవ జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడాలంటే మొక్కలు పెంచడం ఒక్కటే మార్గం అన్నారు. అడవులు తగ్గిపోవడం వల్ల అనేక ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి కాబట్టి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వృక్షో రక్షతి రక్షతః అనే నినాదంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి క్యాడేట్ల సహాయంతో 60 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల హరితహారం కమిటీ, ఎకో క్లబ్ కమిటీ పాలుపంచుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ రజిని లత, డా.రాజశేఖర్, హరితహారం కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ కోమల, ఎకో క్లబ్ కన్వీనర్ ఎన్ ఎస్ ఎస్ పి. ఓ డా. ఘన్ సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. సీతా రాములు, డా. గంగిశెట్టి శ్రీనివాస్,డా. మాలతి లత,ఎన్సిసి ఇన్చార్జి డా. రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా.రవికుమార్, జాయింట్ సెక్రెటరీ డా.కిషోర్ కుమార్, ఐ క్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. శ్రీనాథ్, సీనియర్ అధ్యాపకులు డా. చిన్న, డా. సమ్మయ్య, డా. వెంకన్న, ప్రొఫెసర్ సమత, పరీక్షల నియంత్రణ అధికారి డా. శివ నాగ శ్రీను, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సిసి క్యాడేట్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ జయంతికి
జంతు వధ నిషేధం

- అక్టోబర్ 2న జంతు వధశాలలు, చికెన్, రిటైల్ మాంసం దుకాణాలు మూసివేయాలి

వరంగల్, ఆయుధం: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న బల్దియా పరిధిలోని 66 డివిజన్లలో అన్ని గొర్రెలు, మేకల వధశాలలు, చికెన్ షాపులు, రిటైల్ మాంసం దుకాణాలు మూసివేయాలని ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజారెడ్డి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న ఆయన, మాంసం వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై GHMC Act, 1955లోని సెక్షన్ 533(B) ప్రకారం చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బల్దియాకు సహకరించాలని ముఖ్య ఆరోగ్యాధికారి డా. రాజారెడ్డి వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.



రెజ్లింగ్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే విద్యార్థుల సత్తా

వరంగల్, ఆయుధం: వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రెజ్లింగ్ వరంగల్ జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే నర్సంపేట పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో చిన్మయి, శ్రావణి ప్రథమ స్థానాలు సాధించగా, అండర్ 17 విభాగంలో దీక్షిత ప్రథమ స్థానం సాధించింది. ప్రథమ స్థానాలు సాధించిన గుంజి చిన్మయి, బానోత్ శ్రావణి, దీక్షిత రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బానోత్ రాజేశ్వరి విద్యార్థులను పాఠశాలలో మంగళవారం అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు బండారి సుకన్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కూడా అభినందించారు.

ధాన్యం కొనుగోలు
సాఫీగా సాగాలి

- అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సెర్ప్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ హనంకొండ ఆధ్వర్యంలో ఖరీఫ్ 202627 కాలానికి ఏర్పాటుచేస్తున్న (65) వరి ధాన్య కొనుగోలు కేంద్రాల పుస్తక నిర్వాహకులు, సీసీలు, ఏపీఎం లతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. ధాన్యాన్ని అమ్మిన రైతులకు 24 గంటలలో డబ్బులు వారి ఖాతాలో జమ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695